సాక్షి
ములుగు
గురువారం । 10 । ఆగస్టు । 2023



డిగ్రీ..నో డిమాండ్

కేయూ పరిధిలో వివిధ రకాల డిగ్రీ కోర్సులు ఉన్నాయి. ఈ విద్యాసంవత్సరం డిగ్రీ మొదటి సంవత్సరంలో 35శాతం సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. - 8లో



గ్రామ దేవతల ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షం

గ్రామ దేవతల ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉందని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. - 8లో

గరిష్టం/కనిష్టం
33.0⁰/26.0⁰

వాతావరణం

జిల్లాలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఎక్కువగా ఉంటుంది. సాయంత్రం చల్లగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఉపాధ్యాయుడు మీనయ్యకు సన్మానం



ఏటూరునాగారం: మండల పరిధిలోని కొండాయి ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుడు పాయం మీనయ్యను రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా సన్మానించింది. ఇటీవల కొండాయి గ్రామంలో జంపన్నవాగు ఉప్పొంగడంతో పాఠశాలలోని 40మంది విద్యార్థులను కాపాడి సురక్షిత ప్రాంతాలకు తరలించిన విషయం తెలిసిందే. కాగా మంత్రి కేటీఆర్ ప్రభుత్వం తరఫున ఘనంగా సన్మానించాలని ఇటీవల క్యాబినెట్ సమావేశంలో ఆదేశించారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని గిరిజన భవన్‌లో నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా మంత్రి సత్యవతి రాథోడ్, గిరిజన కమిషనర్ క్రిష్టియాన చోంగ్తు మీనయ్యను సన్మానించి మెమొంటో అందజేశారు.

'మేరి మిట్టి.. మేరా దేశ్'



ములుగు: ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా మేరి మిట్టి.. మేరా దేశ్ అనే నినాదంతో 75 సంవత్సరాల స్వాతంత్ర్యాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో బుధవారం 75 మొక్కలను నాటారు. ప్రిన్సిపల్ మల్లేషం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి ప్రతీ విద్యార్థి మొక్కను నాటాలన్నారు. ప్లాస్టిక్ వల్ల కలిగే దుష్ప్రభావాలపై ఎన్‌ఎస్‌ఎస్ తరఫున విద్యార్థులకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రజినీలత, అధ్యాపకులు యుగేందర్, సమ్మయ్య, వెంకన్న, శ్రీకాంత్, యాకూబ్, నాగమణి, మహేందర్, నాగమణి, విజిత, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక



ఏటూరునాగారం: గృహలక్ష్మి పథకం లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుందని జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి అన్నారు. మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు గడదాసు సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కును కీర్తికి అందజేశారు. అనంతరం బూటారం గ్రామ ప్రజలు ప్రతీ ఏడాది వర్షాకాలంలో దయ్యాలవాగు, జంపన్నవాగు ఉధృతితో సమస్యలు ఎదుర్కొంటున్నామని వినతి పత్రం చైర్ పర్సన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి శాశ్వతంగా సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తామని తెలిపారు. గృహలక్ష్మి ఒక నిరంతరం ప్రక్రియ అన్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ, ఎంపీపీ అంతటి విజయ, నాయకులు తుమ్మ మల్లారెడ్డి, అల్లి శ్రీనివాస్, చంద్రబాబు, ఈసం స్వరూప, రాంబాబు, కిరణ్, రామకృష్ణ, దొడ్డ కృష్ణ, చిన్ని కృష్ణ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న ప్రభుత్వాలు



ములుగు రూరల్: కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ప్రభుత్వాలను గద్దెదించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ అన్నారు. ఈ మేరకు బుధవారం జాతీయ కార్మిక సంఘాలు ఇచ్చిన దేశ వ్యాప్త మహా పడావ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలో ధర్నా చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం కార్మికుల చట్టాల్లోని లేబర్ కోడ్‌లుగా మారుస్తూ కార్పొరేట్ వ్యవస్థకు అండగా నిలుస్తుందన్నారు. కార్మికుల కనీస వేతనాలపై ప్రభుత్వాలు స్పందించడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ఎదురుచూపులు

ఏళ్లుగా సీలింగ్‌భూములను సాగు చేసుకుంటున్న రైతులు

- పట్టాలు ఇప్పించాలని వేడుకోలు
- మైనింగ్ క్వారీలకు మాత్రం పట్టాలు
- అన్నదాతల సమస్యను పట్టించుకోని అధికారులు, పాలకులు



ములుగు రూరల్: ఏళ్ల తరబడి సాగులో ఉన్నా రైతులకు పట్టాలు అందడం లేదు. నిజాం హయాంలో భూస్వాముల నుంచి అప్పటి ప్రభుత్వం సీలింగ్ యాక్ట్ ప్రకారం 9వేల ఎకరాలను స్వాధీనం చేసుకుంది. మల్లంపల్లితో పాటు పరిసర గ్రామాలైన రాంచంద్రాపూర్, భూపాల్‌నగర్, శివతండా, ముద్దునూరు తండా, గుర్తూరు తండా, కొడిశలకుంట, దేవనగర్, శ్రీనగర్ గ్రామాల సమీపంలోని సీలింగ్ భూములను సాగు చేసుకుంటున్న రైతులకు న్యాయం జరగడం లేదు. ఈ విషయంలో పలుమార్లు తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినప్పటికీ లాభం లేకుండా పోయింది. అప్పటి నుంచి ఉమర్‌ఖాన్ పేరున ఉన్న వేల ఎకరాల భూమి రెవెన్యూ రికార్డుల్లో అలాగే కొనసాగుతోంది. ఈ భూములను అనేక ఏళ్లుగా స్థానికులు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. నిబంధనల ప్రకారం తాతల కాలం నుంచి సాగులో ఉన్న రైతులు పట్టాదార్ పాస్‌పుస్తకాలు ఎప్పుడు వస్తాయని ఎదురుచూస్తున్నారు. ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు పట్టాలు రాకపోవడంతో నిరాశ చెందుతున్నారు. ఉమర్‌ఖాన్ వంశం వారసుల పేరుతో కోర్టులో దాఖలైన పిటీషన్ ఇందుకు కారణమని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. గతంలో ఉమర్‌ఖాన్‌కు సంబంధించిన భూములను ప్రభుత్వం సీలింగ్ భూమి కింద తీసుకుంది. న్యాయ ప్రకారం సాగులో ఉన్న రైతులకు పట్టాలివ్వాలి.. కానీ రెవెన్యూ శాఖ కేవలం ఎర్రమట్టి క్వారీలకు మాత్రమే అర్హత కల్పిస్తూ అనుమతివ్వడం చర్చగా మారింది.

మైనింగ్ భూములకు పట్టాలు జారీ

గుట్టలు ఉన్న భూములను మైనింగ్ వ్యాపారులకు రెవెన్యూ అధికారులు పట్టాలు జారీ చేశారు. బడా బాబులు రెవెన్యూ అధికారులను ప్రసన్నం చేసుకొని పట్టాలు పొందారు. మైనింగ్ భూములకు పట్టాలు జారీ చేసి సాగులో ఉన్న రైతులకు పట్టాలు జారీ చేయకపోవడంలో ఆంతర్యం ఏమిటని సాగుదారులు ప్రశ్నిస్తున్నారు. మైనింగ్ వ్యాపారంలో ఉన్న లొసుగును అడ్డుపెట్టుకొని వ్యాపారులు రెవెన్యూ అధికారులకు డబ్బును ఎరగా చూపి ఉన్న భూమికంటే ఎక్కువగానే పట్టాలు పొందారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సాగులో ఉన్న రైతులకు మొండిచేయి

భూమిని నమ్ముకొని దశాబ్దాలుగా సాగులో ఉన్న రైతులను పట్టించుకోకుండా ఉమర్ ఖాన్ భూములకు పట్టాలు జారీ చేయడాన్ని ప్రభుత్వం విస్మరించింది. దీంతో ఒకరి నుంచి మరొకరికి విక్రయించడం ప్రస్తుత రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిలిస్తుంది. భూమి రేటు ప్రకారం కొనుగోలు చేసిన వారు పట్టాలు లేని క్రమంలో తక్కువ ధరలకు అమ్ముకోవాల్సి వస్తుంది. గత కొన్ని సంవత్సరాలుగా రాంచంద్రాపురంతో పాటు మరో ఏడు గ్రామ పంచాయతీల్లో ఈ పరిస్థితి ఉంది. దీంతో పాటు ప్రభుత్వం అందిస్తున్న రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలకు రైతులు దూరమవుతున్నారు. గతంలో మంత్రిగా ఉన్న చందూలాల్ పలుమార్లు ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ప్రత్యేక జీఓ ప్రకారం రైతులకు పట్టాలు అందిస్తామన్న మంత్రి చందూలాల్ ప్రస్తుతం లేరు. దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

పట్టాలు అందించి ఆదుకోవాలి



వారసత్వంగా భూములను సాగు చేసుకొని జీవనం కొనసాగిస్తున్న వారికి ప్రభుత్వం పట్టాలను అందించాలి. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు పట్టాలు లేక దూరమవుతున్నాం. కలెక్టర్, తహసీల్దార్‌లకు పలుమార్లు ఫిర్యాదులు ఇచ్చినా పట్టించుకోవడం లేదు. పట్టాలు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి పట్టాలను అందించాలని వేడుకుంటున్నాం.

- భూక్య సారయ్య, రాంచంద్రాపూర్ రైతు

మైనింగ్ భూములకు పట్టాలు ఎలా ఇచ్చారు ..



ప్రభుత్వ అధికారులు చిన్న, సన్నకారు రైతులు సాగులో ఉన్నప్పటికీ పట్టాలను కేటాయించ కుండా మైనింగ్ వ్యాపారులకు గుట్టలున్న భూములకు పట్టాలను ఎలా జారీ చేశారు. తరతరాలుగా భూమిని సాగు చేసుకుంటు జీవిస్తున్న తమలాంటి వారికి మాత్రం పట్టాలు అందించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి ఉమర్‌ఖాన్ భూములను సాగు చేసుకుంటున్న రైతులందరికీ పట్టాలు ఇవ్వాలి.

- అజ్మీరా శోభన్‌లాల్, రైతు

వైజంక్షన్ నుంచి ర్యాలీగా వస్తున్న ఆదివాసీలు



ఆదివాసీల అభ్యున్నతికి కృషి





కొమురంభీం విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, జెడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతి

- జెడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతి
- కొమురంభీంకు ఘనంగా నివాళులర్పించిన కలెక్టర్, జెడ్పీచైర్‌పర్సన్

ఏటూరునాగారం: ఆదివాసీల అభ్యున్నతికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివాసీ సంఘాలు, ఐటీడీఏ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వైజంక్షన్ నుంచి ఐటీడీఏ వరకు ఆదివాసీ సంఘాల నాయకులు సన్నాయి మేళాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఐటీడీఏ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొని నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా నాగజ్యోతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. పోడు భూములకు హక్కుపత్రాలు సైతం అందించిందని తెలిపారు. గృహలక్ష్మి పథకం ద్వారా ఇళ్లు మంజూరు చేస్తుందని వివరించారు.

ముంపు గ్రామానికి శాశ్వత పరిష్కారం



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కొండాయి ముంపు గ్రామ ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపుతామని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. జంపన్నవాగు భారీ స్థాయిలో పొంగిపొర్లడం ఇదే మొదటిసారి అన్నారు. ప్రభుత్వం జిల్లాపై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు.

నక్సలిజం మాఫియాలా మారింది..

నక్సలిజం ఒక మాఫియాలా మారిందని ఏఎస్పీ శిరిశెట్టి సంకీర్త్ అన్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని అడవుల్లో ఉంటూ అమాయకపు గిరిజనులను వాడుకుంటున్నారని తెలిపారు. ములుగు జిల్లాలో మావోయిస్టులు వారి కార్యకలాపాలు సాగిస్తున్నారని వివరించారు. గిరిజనులు మావోయిస్టుల వైపు ఆకర్షితులు కావొద్దని సూచించారు.

రాబోయే కాలం యువతదే..

ఎమ్మెల్యే సీతక్క

ములుగు: రాబోయే కాలం యువతదేనని ఏఐసీసీ మహిళా ప్రధాన కార్యదర్శి, ములుగు ఎమ్మెల్యే సీతక్క అన్నారు. జిల్లా కేంద్రంలోని గాంధీ పార్కు ఎదుట బుధవారం యువజన కాంగ్రెస్ 63వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీతక్క ముఖ్య అతిథిగా హాజరై గాంధీ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్‌తో కలిసి కేక్ కట్ చేసి యువజన కాంగ్రెస్ నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ యువత రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. ఇంటింటా తిరుగుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న తీరును ప్రజలకు తెలియజేయాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కష్టపడి పని చేసేవారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు యువతను ఎదగకుండా చేశాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రవిచందర్‌తో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే సీతక్క

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

డిప్యూటీ డీఎంహెచ్ఓ క్రాంతికుమార్

కన్నాయిగూడెం: మండల పరిధిలోని ఏజెన్సీ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ క్రాంతికుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సేవలపై డాక్టర్ మౌనికను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. ముందస్తు అనుమతితోనే సెలవులు తీసుకోవాలని సూచించారు. అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు 24 గంటలు వైద్య సేవలు అందించాలన్నారు. సీజనల్ కాలం నడుస్తున్నందున మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అనంతరం భూపతిపురంలో దోమల మందు పిచికారీ చేయించారు. అనంతరం గ్రామంలో డ్రైడే నిర్వహించి పాడైన పాత్రల్లో నిల్వ ఉన్న మురికి నీటిని ఉంచడం వల్ల దోమల వ్యాప్తి జరుగుతుందని తెలియజేశారు. నిత్యం వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు లక్ష్మణ్, ఓం ప్రకాష్, ఎస్‌యూఓ నర్సింహారావు, తదితరులు పాల్గొన్నారు.



రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

బిర్సాముండా పరిశోధనకు ప్రభుత్వం అనుమతి

ఎస్‌ఎస్‌తాడ్వాయి: బిర్సాముండా పరిశోధన బృందానికి ప్రభుత్వ అనుమతులు లభించాయని బిర్సాముండా రీసెర్చ్ సెంటర్ బాధ్యులు కొర్నెబెల్లి గణేశ్ తెలిపారు. హైదరాబాద్‌లో ప్రభుత్వ ఆధ్వార్యాన బుధవారం నిర్వహించిన ఆదివాసీ ప్రపంచ దినోత్సవ కార్యక్రమంలో ట్రైబల్ కల్చర్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ తెలంగాణ వారితో పనిచేయుటకు మెమోరాండం ఆఫ్ అండర్స్టాండింగ్ కింద బిర్సాముండా యూత్ పరిశోధన బృందానికి డైరెక్టర్ సర్వేశ్వర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఆ ఉత్తర్వులను మంత్రి సత్యవతి రాథోడ్, గిరిజన సంక్షేమ ప్రిన్సిపల్ కార్యదర్శి క్రిస్టియనా చోంగ్తు చేతుల మీదుగా అందుకున్నామని వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ సంస్కృతీ, సంప్రదాయాలు, ఆహార అలవాట్లు కట్టుబాట్లు ఇలావేల్పు జాతరల చరిత్ర ఔషధ మొక్కలు, ఇండిజినస్ జ్ఞానంపై తదితర అంశాలపై నివేదికలు తయారు చేసి పంపించే అవకాశం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా దక్కడం హర్షించదగిన విషయమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మైపతి అరుణ్ కుమార్, రీసెర్చ్ సెంటర్ బాధ్యులు కోరం ఎర్రన్న, పోలెబోయిన రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



ఉత్తర్వులు అందుకుంటున్న పరిశోధన బృందం

ముంపు బాధితుల తిరుగు ప్రయాణం

వంట సామగ్రి అందజేసిన దాతలు

ఏటూరునాగారం: వరద ముంపు బాధితులు మండల కేంద్రంలోని పోస్టుమెట్రిక్ హాస్టల్ నుంచి కొండాయి ప్రజలు బుధవారం తిరిగి వెళ్లిపోయారు. ముంపు బాధితులను మండల కేంద్రం నుంచి ప్రత్యేక వాహనాల్లో తరలించినట్లు ఎంపీడీఓ కుమార్, తహసీల్దార్ వీరస్వామి తెలిపారు. వారి సామగ్రిని సైతం జాగ్రత్తగా ఇళ్లకు చేర్చారు. వరదలు తగ్గుముఖం పట్టడంతో ముంపు ప్రజలను తరలించినట్లు అధికారులు తెలిపారు. అనంతరం గ్రామాల్లో సర్వే ఉంటుందని, అందరూ ఇళ్ల వద్ద ఉండాలని అధికారులు ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాక వెంకటేశ్వర్లు, ఆర్ఐ శ్రీనివాస్, సిబ్బంది ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

వరదలతో సర్వం కోల్పోయిన కొండాయి, మల్యాల గ్రామ వాసులకు లయన్స్ క్లబ్, శ్రీనివాస సేవా ట్రస్ట్‌తో పాటు పలువురు చేయూతనందిస్తున్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్‌కు చెందిన లయన్స్ క్లబ్ వారు సంయుక్తంగా కొండాయి, మల్లాలకు చెందిన సుమారు 250 కుటుంబాలకు దోమ తెరలు, వంట పాత్రలను బుధవారం గిరిజన భవన్‌లో ఏఎస్పీ సంకీర్త్, సీఐ రాజు, ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వివేకానందపురం క్లబ్ డైరెక్టర్ పింగిలి నాగరాజు, వరంగల్ క్లబ్ ప్రెసిడెంట్ పింగిలి శరత్ బాబు మాట్లాడుతూ వరదలతో సర్వం కోల్పోయిన కుటుంబాలకు కొంత అండగా నిలవడం తమ వంతు సామాజిక బాధ్యతగా భావించి ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. శరణార్థులకు అండగా నిలిచిన లయన్స్ క్లబ్ వారిని ఏఎస్పీ సంకీర్త్ అభినందించారు. దూర ప్రాంతం నుంచి వచ్చి సరుకులు అందించిన లయన్స్ క్లబ్ వారికి కొండాయి సర్పంచ్ కాక వెంకటేశ్వర్లు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే దొడ్ల వరద బాధితులకు భువనేశ్వరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు, ప్లాస్టిక్ డబ్బాలు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ మోతుకూరి రామేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పద్మజ, కోశాధికారి వీధి మొగిలి, సలహాదారు సంతోష్, ఎం. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. శ్రీశ్రీనివాస సేవా ట్రస్టు హనుమకొండ వారి సహకారంతో గంటల కుంటలోని 36 కుటుంబాలు, చింతలపాడులోని 60 కుటుంబాలకు నిత్యావసర సరుకులు, వంట పాత్రలను అందజేశారు. అదే విధంగా మేడ్చర్ల డీఆర్‌డీఓ పద్మజారాణి సారథ్యంలో డీఆర్‌డీఏ, సెర్ప్ సిబ్బంది, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సహకారంతో కొండాయి, మల్యాల, దొడ్ల వరద బాధితులకు ఐకేపీ కార్యాలయం ఆవరణలో రూ.వెయ్యి రూపాయల విలువచేసే వంట పాత్రలు, ఇతర సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో డీపీఎం శీలం ప్రభాకర్, డీపీఎం బొల్లు లత తదితరులు పాల్గొన్నారు.



కొండాయికి తరలివెళ్తున్న బాధితులు, పర్యవేక్షిస్తున్న అధికారులు



బాధితులకు వస్తువులు అందజేస్తున్న పోలీసులు



దొడ్లలో సామగ్రి అందజేస్తున్న భువనేశ్వరి ట్రస్ట్..

సింగరేణి కార్మికుల నిరసన



భూపాలపల్లి అర్బన్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా బుధవారం ఏరియాలోని సింగరేణి గనుల వద్ద కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. 6వ గనిలో జరిగిన నిరసన కార్యక్రమానికి సీఐ టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంపేటి రాజయ్య హాజరై మాట్లాడారు. కోల్ ఇండియా వాటాలను కేంద్ర ప్రభుత్వం వేలం వేసిందని దీంతో రాష్ట్రంలోని సత్తుపల్లి, పెనగడప, శ్రావణపల్లి, కేకే -6 బ్లాక్‌ను ప్రైవేట్‌కు అప్పగిస్తుందన్నా రు. కార్మిక చట్టాలను సవరించి 4 కోడ్‌లుగా మార్చడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఆల్ ఇండియా కోల్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు.

క్రీడల్లో భూపాలపల్లి ముందుండాలి

ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి అర్బన్: యువత దురలవాట్లకు పోకుండా వ్యాయామం, క్రీడల్లో రాణించి జిల్లా మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి కోరారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ స్టేడియంలో ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గండ్ర హరీష్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్ క్రీడల పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మారుతున్న కాలంలో సగటు మనిషి వ్యాయామంపై శ్రద్ధ చూపాలని కోరారు. క్రీడల్లో క్రీడాకారులకు గెలుపు ఓటములు సహజమేనని, ఓడినవారు మళ్లీ గెలుపు దిశగా అడుగువేయాలన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫుట్‌బాల్ క్రీడాకారులను అభినందించి, ఆటను ప్రారంభించారు.

జిల్లాలో పూర్తి స్థాయిలో కార్యాలయాలు

జిల్లా కేంద్రంలో పూర్తి స్థాయిలో ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయడం జరిగిందని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో ఎమ్మార్సీ భవనంలో ఏర్పాటు చేసిన జిల్లా సహాయ కార్మిక సంక్షేమ శాఖ కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో జోనల్ జాయింట్ కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ శ్యామల్, అసిస్టెంట్ లేబర్ అధికారిణి వినోద, నాయకులు పాల్గొన్నారు.



ఫుట్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

క్లుప్తంగా

ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలి



మాట్లాడుతున్న శ్రీకాంతారావు

హన్మకొండ కల్చరల్ : దేవాలయ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని, ఆ భూములను నిబంధనల మేరకు కౌలుకు ఇచ్చి వచ్చిన ఆదాయం బ్యాంక్‌లో జమచేయాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ వరంగల్ జోన్ డిప్యూటీ కమిషనర్ టి. శ్రీకాంతారావు ఆదేశించారు. బుధవారం పాత సెంట్రల్ జైల్ ఎదుట గల దేవాదాయ శాఖ (ధార్మిక భవన్) కార్యాలయంలో ధూప దీపనైవేద్య పథకం ద్వారా లబ్ధిపొందుతున్న అర్చకుల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి 200మంది అర్చకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీకాంతారావు.. అర్చకులు, దేవాదాయశాఖ సిబ్బందికి పలు సూచనలు చేశారు. దేవాలయంలో సమయపాలన పాటించాలని ఆదేశించారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత, పర్యవేక్షకులు వీరస్వామి, సాయిబాబా, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ.. నో డిమాండ్

కేయూ డిగ్రీ కళాశాలల్లో సగం కూడా భర్తీ కాని సీట్లు

- 287 కళాశాలల్లో మొత్తం 98,980 సీట్లు
- 34,959 సీట్లు మాత్రమే భర్తీ.. 64,021 ఖాళీ
- ఇక స్పెషల్ ఫేజ్ అడ్మిషన్ల ప్రక్రియ షురూ



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ, బీసీఏ, కంప్యూటర్ కాంబినేషన్‌లతో పాటు వివిధ రకాల కోర్సులు ఉన్నాయి. ఈ విద్యా సంవత్సరంలో 2023–2024లో ఆయా డిగ్రీ కోర్సుల్లో ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు గాను ఇప్పటి వరకు మూడు దశల్లో డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ (దోస్త్) ద్వారా సీట్లు కేటాయింపులు జరిగాయి. యూనివర్సిటీ పరిధిలో ఉన్న సీట్లల్లో సగం కూడా భర్తీకాలేదు. కేవలం 35శాతం మాత్రమే భర్తీ అయ్యాయి. యూనివర్సిటీ పరిధిలో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్, అటానమస్ డిగ్రీ కళాశాలలు కలిపి 267 ఉన్నాయి. అందులో వివిధ డిగ్రీ కోర్సులన్నీ కలిపి మొత్తం 98,980 సీట్లు ఉన్నాయి. ఈ ఏడాది మే నుంచి జూలై వరకు మూడు దశల్లో అడ్మిషన్ల ప్రక్రియ జరిగింది. మొదటి దశలో కేయూ పరిధిలోని కళాశాలలకు 16,078 సీట్లు కేటాయించగా అందులో 10,678 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. ఆ తరువాత జరిగిన రెండోదశలో 11,112 సీట్లు కేటాయించగా 8,342 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. ఆ తరువాత మూడోదశలో 18,076 సీట్లు కేటాయించగా 15,939 మంది విద్యార్థులు కళాశాలల్లో చేరారు. మూడు దశల్లో నిర్వహించిన డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియలో మొత్తం 45,266 సీట్లు కేటాయించగా 34,959 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. కేవలం 35శాతం సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. ఇంకా 64,021 సీట్లు ఖాళీగా ఉన్నాయి.

స్పెషల్ ఫేజ్‌కు అడ్మిషన్ల ప్రక్రియ షురూ..

రాష్ట్రంలోని డిగ్రీ కళాశాలల్లో ఈ విద్యాసంవత్సరంలో ప్రవేశాలకుగాను మూడు దశలు ముగిసినా వివిధ యూనివర్సిటీల పరిధిలో సీట్లు చాలా మిగిలాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి దోస్త్ ద్వారా స్పెషల్ ఫేజ్ ద్వారా అడ్మిషన్ల ప్రక్రియకు షెడ్యూల్ జారీ చేసింది. ఈ నెల 7వతేదీ నుంచి స్పెషల్ ఫేజ్ అడ్మిషన్ల ప్రక్రియ షురూ అయింది. ఈ నెల 13వ తేదీ వరకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. సోమవారం నుంచి ఈనెల 14వ తేదీవరకు వెబ్ ఆప్షన్‌లు ఇచ్చుకోవాలి. ఈనెల 17న సీట్లు కేటాయింపు జరగనుంది. స్పెషల్ ఫేజ్ నిర్వహించినా కూడా సీట్లు పూర్తిస్థాయిలో భర్తీ అయ్యే పరిస్థితి కనపడడంలేదు. ఇంటర్ పూర్తికాగానే ఎక్కువశాతం మంది విద్యార్థులు ఇంజనీరింగ్, మెడిసిన్, ఇతర ప్రొఫెషనల్ కోర్సులతోపాటు దూర ప్రాంతాల రాష్ట్రాలకు తరలివెళ్తున్నారు. దీంతో సంప్రదాయ డిగ్రీ కోర్సులకు ఆదరణ తగ్గిపోతుంది. డిగ్రీలో కూడా పలు కొత్త కోర్సులు ప్రవేశపెట్టినప్పటికీ వాటికి కూడా ఆదరణ అంతగా ఉండడం లేదనే సీట్ల భర్తీని బట్టి తెలుస్తోంది. మరోవైపు డిగ్రీలోనూ గురుకులాల సంఖ్య పెంపుదల చేశారు. దీంతో గురుకులాల్లో చేరడంతో ఆ ప్రభావం కూడా ఇతర కళాశాలపై పడిందని భావిస్తున్నారు. మరోవైపు గత విద్యాసంవత్సరంలో విద్యార్థులు అసలే లేని కళాశాలలకు ఈ విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు దోస్త్‌లో కొన్నింటికి అవకాశం ఇవ్వలేదు. మరి కొన్నింటికి ఇచ్చారు. ఫలితంగా ఆయా కళాశాలల్లో సీట్లు భర్తీ ఈ విద్యాసంవత్సరంలోనూ అంతంత మాత్రమేనని సమాచారం.

మూడుదశల్లో అడ్మిషన్ల ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో కేయూ పరిధిలో గత నెల 27నుంచే క్లాస్‌లు ప్రారంభమయ్యాయి. స్పెషల్‌ఫేజ్ అడ్మిషన్లకు అవకాశం ఇచ్చినా అంతంతమాత్రమే సీట్లు భర్తీ అయ్యే అవకాశాలున్నాయని భావిస్తున్నారు.

గ్రామ దేవతల ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షం



బోనం ఎత్తుకున్న మంత్రి దయాకర్‌రావు

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

తొర్రూరు: గ్రామ దేవతల ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉందని, కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బుధవారం డివిజన్ కేంద్రంలో జరిగిన బోనాల వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. బోనం ఎత్తుకుని మహిళలతో కలిసి ముత్యాలమ్మ గుడిలో మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ప్రకటించి నిరుద్యోగ యువతను మోసగించిందన్నారు. సీఎం కేసీఆర్ హామీ ప్రకారం 1.33 లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేశారని, 80 వేలకు పైగా ఖాళీలకు నోటిఫికేషన్లు ఇచ్చారని గుర్తు చేశారు. రూ.152 కోట్లతో తొర్రూరు మున్సిపాలిటీని అభివృద్ధి చేయనున్నామన్నారు. సంక్షేమ పాలనతో ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్న బీఆర్‌ఎస్ పార్టీని ఆదరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, పట్టణాభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ పానుగోటి సోమేశ్వర్‌రావు, వైస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, కౌన్సిలర్ శ్రీనివాసరావు, దొంగరి రేవతి, నాయకులు కుర్ర శ్రీనివాస్, దొంగరి శంకర్, కర్నె నాగరాజు, జైసింగ్, పూలమ్మ పాల్గొన్నారు.

కేయూలో ఎస్‌ఎఫ్‌సీ విద్యార్థుల ధర్నా

- రెండోరోజూ కొనసాగింపు
- హాస్టల్ వసతి కల్పిస్తామని ప్రిన్సిపాల్, డైరెక్టర్ హామీ
- ఆందోళన విరమణ



ఆందోళన చేస్తున్న విద్యార్థులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ఎస్‌ఎఫ్‌సీల విద్యార్థులు తమకు హాస్టల్ వసతి కల్పించాలని డిమాండ్ చేస్తూ రెండోరోజు కూడా బుధవారం ఉదయం 6 గంటల నుంచే గేట్ మూసివేసి ధర్నా చేశారు. మొదటి గేట్ మూసివేతతో రాకపోకలకు అంతరాయం కలిగింది. దీనిపై సమాచారం అందుకున్న యూనివర్సిటీ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బి సురేష్ లాల్, కేయూ హాస్టళ్ల డైరెక్టర్ ఆచార్య వై వెంకయ్య మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో ఘటనా స్థలికి చేరుకున్నారు. వెంకయ్య మాట్లాడుతూ గత విద్యాసంవత్సరంలో ఏ ఎస్‌ఎఫ్‌సీకి సంబంధించిన విద్యార్థులకు కూడా హాస్టల్ వసతి కల్పించలేదన్నారు. అయినా కొందరు నాన్‌బోర్డర్లుగా ఉండడం సరికాదన్నారు. అన్ని ఎస్‌ఎఫ్‌సీల విద్యార్థులకు మరో 15 రోజుల్లో హాస్టల్ వసతి కల్పిస్తామని హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. కాగా, ఆందోళనకు ఏబీఎస్‌ఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్, బీఎస్‌ఎఫ్ కేయూ ఇన్‌చార్జ్ బొట్ల మనోహర్, బి రాకేష్ (ఎస్‌ఎస్‌యూఐ), మహేష్(పీడీఎస్‌యూ) తదితరులు మద్దతు తెలిపారు.

పసుపు ధర పైపైకి..

- కేసముద్రం మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.13,221
- వరంగల్‌లో రూ.13వేలు..



కేసముద్రం మార్కెట్‌కు వచ్చిన పసుపు

కేసముద్రం: మహబూబాబాద్ జిల్లాలోని కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం పసుపుకు రికార్డుస్థాయిలో రూ.13,221 ధర పలికింది. మార్కెట్‌లో పసుపు సీజన్ ప్రారంభంలో క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.5 నుంచి 6వేల వరకు పలుకగా, నెల రోజుల నుంచి ధర క్రమక్రమంగా పెరుగుతూవస్తోంది. ఈ మేరకు బుధవారం మార్కెట్‌కు 56 బస్తాల పసుపు అమ్మకానికి రాగా, కాడిరకం పసుపుకు గరిష్ట ధర రూ.13,221, కనిష్ట ధర రూ.8,651 పలుకగా, గోళారకం పసుపుకు క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.11,752, కనిష్ట ధర రూ.6,509 పలికినట్లు మార్కెట్ అధికారులు పేర్కొన్నారు. కాగా, రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఏనుమాముల మార్కెట్‌లో రూ.13వేలు

వరంగల్: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం పసుపు అత్యధికంగా క్వింటాల్‌కు రూ.13వేల ధర పలికింది. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం మైలారం గ్రామానికి చెందిన నూనె రాజయ్య మార్కెట్‌కు 20 బస్తాల పసుపు తీసుకొచ్చారు. పసుపు కాడి రకానికి క్వింటాల్‌కు రూ.13వేలు, గోళా రకానికి రూ.12600 పలకిందని యార్డు ఇన్‌చార్జ్ సాగర్ తెలిపారు. ఈ పసుపును జెకె.ఎంటర్‌ప్రైజెస్ నుంచి ఓసాయి ట్రేడర్స్ కొనుగోలు చేసినట్లు తెలిపారు.

అవార్డు సాధనకు పోటీ పడాలి

- టీఎస్ ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ జాన్సి శ్రీలత
- 28 మంది ఉద్యోగులకు ప్రగతి చక్రాల పురస్కారం



ఆర్టీసీ ఉద్యోగులకు అవార్డులు అందజేసి సన్మానిస్తున్న ఆర్ఎం శ్రీలత

హన్మకొండ: అవార్డు సాధనకు ఉద్యోగులు పోటీ పడాలని టీఎస్ ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ జాన్సి శ్రీలత అన్నారు. బుధవారం హనుమకొండలోని వరంగల్-1 డిపోలో వరంగల్ రీజియన్ స్థాయి ప్రగతి చక్రాల పురస్కార ప్రదానోత్సవం జరిగింది. వరంగల్ రీజియన్‌లోని 9 డిపోల్లో అత్యుత్తమ పనితీరు కనబరిచిన 28 మంది ఉద్యోగులకు ఆర్ఎం శ్రీలత నగదు అవార్డుతో పాటు ప్రశంస పత్రాలు అందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిపో, రీజియన్ స్థాయిలో కాకుండా రాష్ట్ర స్థాయి అవార్డు సాధించడంపై ఉద్యోగులు దృష్టి సారించాలన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో ఉద్యోగులు సంతోషంగా ఉన్నారన్నారు. అయితే ప్రభుత్వంలో విలీనంతో ఉద్యోగులపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. వరంగల్ రీజియన్ లాభాల్లో నడిచేలా అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్లు కృపాకర్ రెడ్డి, మాధవరావు, ఈఈ భాస్కర్, డిపో మేనేజర్లు పాల్గొన్నారు.

అవార్డులు అందుకున్న ఉద్యోగుల వివరాలు...

వరంగల్-1 డిపో డ్రైవర్లు ఎ.రాజేందర్, టి.జె.సింగ్, కె.శ్యామ్, ఎం.శ్రీను, కె.వీరయ్య, భూపాలపల్లి డిపో డ్రైవర్లు కె.రాజేందర్, డి.కోటయ్య, పరకాల డిపో డ్రైవర్ టి.భిక్షపతి, వరంగల్-2 డైవర్లు బి.పోచయ్య, ఎ.వెంకటయ్య, వరంగల్-2 డిపో కండక్టర్ బి.ఎస్.రావు, భూపాలపల్లి కండక్టర్ జి.సునీత, వరంగల్-1 డిపో కండక్టర్ జి.సుధాకర్, ఎస్.రమేష్, మహబూబాబాద్ కండక్టర్లు వీరన్న, వి,ఉమ, హనుమకొండ డిపో కండక్టర్లు ఎస్.రమేష్, ఎస్.కె.వై.పాషా, నర్సంపేట డిపో కండక్టర్లు బి.హరిసింగ్, బి.మహేందర్, టిమ్ డ్రైవర్లు కె.దినేష్‌కుమార్ (హనుమకొండ), టి.దేవేందర్ (హనుమకొండ), బి.సురేష్ (నర్సంపేట), ఎం.డి.షాహీద్ (నర్సంపేట), పి.ఆర్.రెడ్డి (నర్సంపేట), మెకానిక్‌లు టి.శంకరయ్య (వరంగల్-1), ఎం.సంజీవయ్య (వరంగల్-2), శ్రామిక్ ఎస్.సంపత్ కుమార్ (జనగామ) అవార్డులు అందుకున్నారు.

ఆయుర్వేద వైద్యకళాశాలలో అడ్మిషన్లకు అనుమతి

కాశిబుగ్గ: వరంగల్ అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లకు అనుమతి లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ విజయగణేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ కమిషన్ ఫర్ ఇండియన్ సిస్టమ్ ఆఫ్ మెడిసిన్(ఎన్‌సీఐఎస్ఎం) షరతులతో కూడిన అనుమతి ఇచ్చిందన్నారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులు అందినట్లు ఆయన తెలిపారు. ప్రవేశాల కోసం ఎన్‌సీఐఎస్‌ఎం తనిఖీలకు సహకరించిన ఆస్పత్రి సూపరింటెండెంట్, సిబ్బంది, ఫ్యాకల్టీ మెంబర్లు, కళాశాల సిబ్బంది, రాష్ట్ర ఆయుష్ డైరెక్టర్ హరిచందనకు కృతజ్ఞతలు తెలిపారు.

వక్ఫ్ ఆస్తులు పరిరక్షించాలి



సెక్రటరీకి మొక్కను అందజేస్తున్న తన్వీర్

న్యూశాయంపేట: వరంగల్ జిల్లాలో వక్ఫ్ ఆస్తులు పరిరక్షించడానికి చర్యలు తీసుకుని ముస్లింల సమస్యలు పరిష్కరించాలని వరంగల్ వక్ఫ్ ప్రాపర్టీస్ ప్రొటెక్షన్, డెవలప్‌మెంట్ కమిటీ, ముస్లిం ప్రతినిధి బృందం కోరింది. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య నేతృత్వంలో హైదరాబాద్‌లో మైనారిటీ సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సయ్యద్ ఉమర్ జలీల్‌ను కలిసింది. ఈ సందర్భంగా బృందం సభ్యులు మాట్లాడుతూ వరంగల్ ఫోర్ట్‌రోడ్ లోని ఈద్గా అభివృద్ధికి సీఎం కేసీఆర్ రూ. కోటి 40 లక్షల ప్రత్యేక నిధులు మంజూరు చేశారన్నారు. ఈ నిధుల విడుదలకు వెంటనే అనుమతి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రోడ్లు, భవనాల కార్పొరేషన్ చైర్మన్ మెట్టు శ్రీనివాస్, ఈద్గా కమిటీ బాధ్యులు ఎం.ఎ.ఖాలీఖ్‌తన్వీర్, సాధిక్ అలీ, ఎం.ఎం. తహశీర్ తదితరులు పాల్గొన్నారు.

'ఏకపక్ష నిర్ణయాలు చెల్లుబాటు కావు'

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని కామర్స్‌అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల సెమినార్‌హాల్‌లో నిర్వహించిన అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ టీచర్స్ (అకుట్) సర్వసభ్య సమావేశం చర్చలతోనే అర్ధాంతరంగా ముగిసిందని, ఏకపక్ష నిర్ణయాలు అకుట్ పరిధిలోనికి రావని అధ్యక్షుడు ఆచార్య తౌటం శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ మామిడాల ఇస్తారి , ఉపాధ్యక్షురాలు ఆచార్య బ్రహ్మేశ్వరి, జాయింట్‌సెక్రటరీ కిశోర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8న జరిగిన అకుట్ సర్వసభ్య సమావేశంలో కొందరు అధ్యాపకులు నిర్ణయాలు ఏకపక్షంగా తీసుకున్నారని, అవి చెల్లుబాటు కాదని స్పష్టం చేశారు. సమావేశంలో తీసుకునే నిర్ణయాలకు పూర్తి కోరం అవసరమన్నారు. అందుకే ఏకపక్ష నిర్ణయాలు చెల్లుబాటుకావన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



రంజిత్‌కుమార్ (ఫైల్)

రాయపర్తి: అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వరంగల్ చార్‌బౌళి ప్రాంతానికి చెందిన కాడర్ల రంజిత్‌కుమార్ (35) నగరంలో బంగారం షాపు నిర్వహించుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. కుటుంబ పోషణ కోసం విరివిగా అప్పులు చేశాడు. తీర్చే మార్గం కనిపించక సోమవారం సాయంత్రం హనుమకొండ పెద్దమ్మగడ్డ ప్రాంతంలో ఎస్సారెస్పీ కాల్వలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహం కాల్వలో రాయపర్తి మండల కేంద్రంలోని గుబ్బడిబోడుకిందితండాకి కొట్టుకొచ్చింది. దీనిని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా వెంటనే ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని కాల్వ నుంచి బయటకు తీసి రంజిత్‌కుమార్‌గా గుర్తించారు. అనంతరం పోస్టుమార్టం మృతదేహాన్ని నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై మృతుడి సోదరుడు రాకేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. మృతుడికి భార్య సుష్మిత, పాప, బాబు ఉన్నట్లు తెలిపారు.

మృతదేహం వెలికితీసి పోస్టుమార్టం

వరంగల్ క్రైం: హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని బొక్కలగడ్డ ఈద్గాలో బుధవారం ఉదయం గత నెల 12న పూడ్చి పెట్టిన మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిర్వహించారు. సీఐ కరుణాకర్ కథనం ప్రకారం హనుమకొండ గుడిబండల్ ప్రాంతానికి చెందిన షహనజ్‌కు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. పెద్ద కుమార్తె కాజోల్ (20)వీణాబజార్‌లో ఓ బట్టల షాపులో పనిచేస్తోంది. కాజోల్ అంబాల గ్రామానికి చెందిన అబ్బాస్‌తో ఆరు సంవత్సరాల నుంచి సహజీవనం చేస్తోంది. ఈ క్రమంలో పెండ్లి విషయంలో కాజల్, అబ్బాస్‌కు గొడవలు జరిగాయి. ఇదిలా ఉండగా అనారోగ్య కారణాల రీత్యా గత నెల 12న కాజోల్‌ను ఎంజీఎంలో అడ్మిట్ చేయగా చికిత్స పొందుతూ మృతి చెందింది. అదే రోజు రాత్రి అబ్బాస్ బొక్కలగడ్డ ఈద్గాలో కాజోల్ మృతదేహం పూడ్చిపెట్టాడు. ఈ ఘటనపై మృతురాలి తండ్రి షహనజ్ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి హనుమకొండ తహసీల్దార్ సమక్షంలో కేఎంసీ ఫోరెన్సిక్ వైద్యులతో పోస్టుమార్టం నిర్వహించినట్లు సీఐ తెలిపారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా నిందితుడిపై చర్యలు తీసుకుంటామని సీఐ పేర్కొన్నారు.

చికిత్స పొందుతున్న ఒకరి మృతి

గీసుకొండ: గ్రేటర్ వరంగల్ నగరం 15వ డివిజన్ రెడ్డిపాలెం గ్రామానికి చెందిన తుపాకుల సూకాంబ్రం(60) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందారు. సూకాంబ్రం మంగళవారం ఈత కొమ్మలు కోయడానికి తన ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో మొగిలిచర్ల బస్టాండ్ వద్ద వెనక నుంచి అతివేగంగా వచ్చిన కోళ్ల వ్యాన్.. ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలపాలైన ఆయనను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. దీనిపై మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపారు.

స్కూల్‌బస్సును ఢీకొట్టిన జెడ్పీ ఫ్లోర్‌లీడర్ స్వప్న వాహనం

- ఏడుగురు విద్యార్థులకు తీవ్రగాయాలు.. ఒకరిని వరంగల్‌కు రెఫర్
- సకాలంలో రాని 108 వాహనం.. రోడ్డు వెంట వాహనాలు ఆపి తరలించిన స్థానికులు
- జెడ్పీ ఫ్లోర్‌లీడర్‌కు తీవ్రగాయాలు కావడంతో మరో వాహనంలో హనుమకొండకు తరలింపు



ప్రమాదానికి గురైన కారు, బస్సు..



తీవ్రంగా గాయపడిన మహేష్



ప్రమాదంలో గాయపడిన చిన్నారులు

నర్సంపేట రూరల్ : ఆగి ఉన్న స్కూల్ వ్యాన్‌ను వరంగల్ జిల్లా జెడ్పీ ఫ్లోర్ లీడర్, నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సతీమణి పెద్ది స్వప్న వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏడుగురు విద్యార్థులకు తీవ్రగాయాలయ్యాయి. అందులో ఒకరిని మెరుగైన చికిత్స నిమిత్తం వరంగల్‌కు రెఫర్ చేశారు. ఈ ఘటన వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణ శివారులో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. నర్సంపేట పట్టణంలోని పాత్‌ఫైండర్ స్కూల్‌కు చెందిన ఇటుకాలపల్లి, నారక్కపేటకు రూట్ స్కూల్ బస్సు సాయంత్రం 5.20 గంటలకు 24 మంది పిల్లలతో బయలుదేరి వెళ్లింది. నారక్కపేట వైపు వెళ్లేందుకు 365 జాతీయ రహదారి వద్దకు చేరుకుంది. ముందు ద్విచక్రవాహనం ఉండడంతో డ్రైవర్ బస్సు నిలిపిఉంచారు. ఆ సమయంలో నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సతీమణి వరంగల్ జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న ఫార్చ్యూనర్ కారులో డ్రైవర్‌తో కలిసి ముత్తోజీపేట వైపు వేగంగా వస్తున్నాడు. ద్విచక్రవాహనాన్ని తప్పించపోయి కమలాపురం గ్రామానికి వెళ్లే రోడ్డు వైపు తిప్పడంతో ఆ పక్కనే నిలిపివేసిన బస్సు వెనుకవైపు ఢీకొట్టారు. దీంతో బస్సు పల్టీ కొట్టే సమయంలో పక్కనే చెట్టు ఉండడంతో పెను ప్రమాదం తప్పింది. బస్సులోని 19మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. పెద్ది స్వప్నకు కూడా తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108కు సమాచారం అందించారు. 108 వాహనం సకాలంలో రాకపోవడంతో జాతీయ రహదారిపై వెళ్తున్న వాహనాలను ఆపి విద్యార్థులను ఆస్పత్రికి తరలించారు. నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రి 11మంది తరలించగా ముగ్గురికి తీవ్రగాయాలైన అన్విత్, కీర్తనలను ఆస్పత్రిలో అడ్మిట్ చేశారు. నల్లబెల్లి మండలం నారక్కపేటకు చెందిన ఎం. మహేష్‌కు ప్రాథమిక చికిత్స నిర్వహించి వరంగల్‌కు రెఫర్ చేశారు. మరో 8మందిని నర్సంపేట పట్టణంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వారిలో రిత్విక్, సహస్ర, నందు, దీక్షిత్‌లకు తీవ్రగాయాలు కాగా అడ్మిట్ చేశారు. మిగతావారికి చికిత్స అందించి తల్లిదండ్రులకు అప్పగించారు. నర్సంపేట ఏసీపీ తిరుమల్, టౌన్ సీఐ రవికుమార్, రూరల్ సీఐ కిషన్ ఆధ్వర్యంలో ప్రమాదంపై విచారణ జరుపుతున్నారు. గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని విద్యార్థి సంఘాల నాయకులు పోలీసులను కోరారు.

హనుమకొండకు పెద్ది స్వప్న తరలింపు

ప్రమాదంలో గాయపడిన జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్నను వెంటనే వేరే వాహనంలో హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతున్నట్లు సమాచారం.